క్లుప్తంగా

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న మంజుల

జనగామ: ప్రపంచ వినియోగదారుల హక్కుల (వరల్డ్ కన్జ్యూమర్ రైట్స్ సంస్థ) తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన పొత్కనూరి మంజులను నియమిస్తూ సంస్థ ఇంటర్నేషనల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంజులకు మంగళవారం నియామక పత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వినియోగదారుల హక్కులు, ప్రయోజనాల కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకునే విధంగా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర చైర్‌పర్సన్‌గా బాధ్యతలను అప్పగించిన ఫౌండర్, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ మండల కమిటీ..



బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ మండల కమిటీని పూర్తిస్థాయిలో నియమించినట్లు మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పలువురికి నియామక పత్రాలను అందజేశారన్నారు. ఉపాధ్యక్షులుగా బాల్నె రమేశ్, ఆనందం, గార్లపాటి మహిపాల్ రెడ్డి, మట్టి బాల్‌రాజు, ఆరేళ్ల భాస్కర్, నీల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా అల్వాల ఎల్లయ్య తదితర కార్యదర్శులు, సభ్యులను నియమించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు నల్లనాగుల వెంకటాచారి, ఎద్దు హరీష్, కర్ణాకర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

నేషనల్ క్రిస్టియన్ సెల్..

జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేట్ షాలోమ్ చర్చిలో నేషనల్ క్రిస్టియన్ సెల్ నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సెల్ జిల్లా లీగల్ అధ్యక్షుడిగా కందుల దాసు, జనరల్ సెక్రటరీగా బిర్రు స్వప్న, ఉపాధ్యక్షుడిగా తోట దినేష్‌ను స్టేట్ ప్రెసిడెంట్ మద్దెల సంజయ్ ఆనంద్, జనరల్ సెక్రెటరీ బక్క ఏలియా నియమించారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో మంగళవారం రాత్రి ఎల్లమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. శివసత్తులు, మహిళలు బోనాలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎల్లమ్మ కల్యాణానికి రూ.5,016 కానుక

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులకు చెందిన మాజీ ఎంపీటీసీ, సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి గుగ్గిళ్ల నర్సయ్య మంగళవారం నాగారంలో జరిగిన ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో పాల్గొని రూ.5,016 కానుకగా ఇచ్చారు. మాజీ సర్పంచ్ భాస్కర్, ఎల్లమ్మ కల్యాణోత్సవ నిర్వాహకులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



నర్మెట: మండలకేంద్రంలో 11 ఏళ్ల క్రితం గ్రామస్తులు దుర్గామాత దేవాలయాన్ని నిర్మించి ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి పండుగను నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో మార్చి 1, 2వ తేదీల్లో ఉత్సవాల నిర్వహణకు కమిటీ అధ్యక్షుడు బూస అంజయ్య ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులను చేపట్టారు. కాగా, నర్మెట మల్లికార్జున యాదవ సంఘం రూ. 1,00,116లు, నక్కల రవి రూ. 20,116లు మంగళవారం ఆలయ కమిటీకి అందజేశారు. గౌరవ అధ్యక్షుడు జంగిటి అంజయ్య, సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తాం

పాలకుర్తి టౌన్: పాలకుర్తి బస్టాండ్‌లో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని వరంగల్-1 డిపో మేనేజర్ వంగాల మోహన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్‌స్టాండ్ ఆవరణంలో సీసీ వేయడంతో పాటు ప్రహరీ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఎస్సై లింగారెడ్డి పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫాంల సందర్శన

తరిగొప్పుల: పౌల్ట్రీ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకి పెద్ద ఎత్తున చనిపోతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పశువైద్యాధికారి శశాంక్ రెడ్డి మండలంలోని పలు పౌల్ట్రీ ఫాంలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కోళ్లను పరిశీలించారు.

బాబోయ్ కోతులు

- జనగామను చుట్టేస్తున్న 'వానర సైన్యం'
- భయబ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితి
- కష్టంగా మారుతున్న ప్రజల జీవనం

జనగామ: జనాభాతో పోటీ పడుతూ కోతుల సంతతి రోజు రోజుకు పెరుగుతుంది. పుణ్య క్షేత్రాలు, అటవీ ప్రాంతాల్లోనే కనిపించే వానరాలు ఒకటో, రెండో ఊర్లు, పట్టణాల్లో కనిపించేవి. అడవులు అంతరించి పోతున్న క్రమంలో కోతుల ఊరు బాట పట్టాయి. మొదట్లో ఒకటి, రెండే కదా అనుకన్నారు.. ఇప్పుడు అవి వేల సంఖ్యలో పెరిగిపోయాయి. జిల్లా కేంద్రంలో 30 వార్డుల పరిధిలో 15వేల కోతుల వరకు హల్‌చల్ చేస్తున్నాయి. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బాట సారులపై దాడులు చేస్తూ భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి. రాత్రి 10 గంటలు దాటిందంటే రైల్వేస్టేషన్ మొదటి, రెండో ప్లాట్ ఫాంపై వందలాది కోతులు చేరి ప్రయాణికులకు దడ పుట్టిస్తున్నాయి. ఆర్టీసీ చౌరస్తా, నెహ్రూపార్కు, రైల్వేస్టేషన్ ఏరియాలో గుంపులు గుంపులుగా కోతులు చేరి రోడ్లను ఆక్రమించేస్తూ దర్జాను ప్రదర్శిస్తున్నాయి. రోజురోజుకు పెరిగిపోతున్న కోతులతో ప్రజల జీవనం కష్టంగా మారుతోంది. ఇంటి గుమ్మం తలుపులు తెరిస్తే చాలు దూరి పోతున్నాయి. దీంతో తలుపులు బిగించుకుని పనులు చక్కబెట్టుకుంటున్నారు. కోతుల నివారణపై కలెక్టర్, సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



జనగామ చౌరస్తాలో గుంపులుగా ఉన్న వానరాలు

స్థానిక సమరంలో సత్తా చాటాలి



దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన గిరిజనులు

- మాజీ మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించుకుని సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాల్‌లో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ స్థాయి పార్టీ సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పెద్దబాయి తండాకు చెందిన మాజీ సర్పంచ్ సునీతరమేశ్ దంపతులు, పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నీరు యాకన్న, రాజేంద్రచారి, గుంజె శివలతో పాటు గిరిజనులు దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సమావేశంలో నాయకులు పేరం రాము, వెంకటేశ్వర్‌రావు, జ్యోతి, కృష్ణమూర్తి, రాజిరెడ్డి, సతీష్‌గౌడ్,వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

బచ్చన్నపేట: ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను వివరిస్తూ, గత బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని గుర్తు చేయాలని బీఆర్‌ఎస్ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు దయాకర్, మసీద్, నర్సింహులు, సురేష్ గౌడ్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని రామచెంద్రాపూర్, ఇటుకాలపల్లి గ్రామాలలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ దూడల కనుకయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కడియందే గెలుపు

- పీసీసీ మాజీ సభ్యుడు అమృతరావు



మాట్లాడుతున్న అమృతరావు

స్టేషన్‌ఘన్‌పూర్: ఉప ఎన్నికలు వస్తాయని, ఏదో జరుగుతుందని కలలు కంటున్న ప్రతిపక్షాల ఆశలు అడియాసలే అవుతాయని, ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరిదే గెలుపు అని పీసీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గంగారపు అమృతరావు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలోకి రాగానే ప్రతిపక్షాల నాయకులు ఎన్నో ఆరోపణలు చేశారని, కడియం గురించి మాట్లాడే హక్కు ప్రతిపక్షాలకు లేదన్నారు. దళితుల డప్పు కొట్టి దళితబంధు పేరుతో వారి వద్ద కమిషన్లు వసూలు చేసిన డాక్టర్ రాజయ్య అభివృద్ధి, పార్టీ ఫిరాయింపులపై కడియంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ ఫిరాయింపులపై ఏ తీర్పు వచ్చినా ప్రజా క్షేత్రంలో కడియందే గెలుపు అని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, తోట వెంకన్న పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

జనగామ రూరల్: పట్టణంలో హైదరాబాద్ రోడ్డులోని ఎన్ హెచ్ 163 రోడ్డును ఆనుకుని పసరమడ్ల సేజీ వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డులో ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో వేమునూరు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన బైపాస్‌లో ప్లాట్లు కోల్పోతున్న యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడారు. అనంతరం బాధితుల పోరాట కమిటీ ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా మోకు కనకారెడ్డి, ఇర్రి అహల్య, జోగు ప్రకాష్, అధ్యక్షుడిగా బూడిది గోపి, న్యాయ సలహా దారులుగా బిర్రు స్వప్న, ఉపాధ్యక్షులుగా జనార్దన్ కోశాధికారిగా గూడెల్లి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.

'నిందితులను శిక్షించాలి'



నిరసన తెలుపుతున్న వేదపండితులు

జనగామ: రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ వేద పండితులు, భక్త మండలి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. వేద పండితులు నల్లాన్ చక్రవర్తుల మురళీధర్ ఆచార్యులు, కందాల లక్ష్మీనరసింహచార్యులు, గుదిమెళ్ల అప్పల ఆచార్యులు, వేదాంతం రాఘవాచార్యులు, కట్టికోల బద్రీనాథ్ మాట్లాడుతూ రంగరాజన్‌పై దాడి క్షమించరానిదన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్బన్ పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రక్షణ కిట్లను అందిస్తున్న డీఎంహెచ్‌ఓ

జనగామ: జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీని జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మల్లిఖార్జున్‌రావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య మహిళా క్లినిక్‌లో మహిళా రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని నమ్ముకుని వచ్చిన ప్రతీ పేషెంట్‌కు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఫైలేరియా పేషెంట్లకు రోగ రక్షణ కిట్లను అందించిన అనంతరం వాటిని ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు.

కేసీఆర్‌ను కలిసిన మనోజ్‌రెడ్డి



చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన మాజీ బీఆర్‌ఎస్ నియోజకవర్గం కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి మంగళవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా అక్రమ అరెస్టులకు భయపడవద్దని కేసీఆర్ చెప్పినట్లు మనోజ్‌రెడ్డి తెలిపారు. అలాగే త్వరలో ఘన్‌పూర్‌లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని, తిరిగి ఎమ్మెల్యేగా గెలుస్తావని కేసీఆర్ అన్నారని రాజయ్య చెప్పారు. అంతకు ముందు కేటీఆర్, హరీశ్‌రావులను కలిశారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: గిరిజనుల ఆరాధ్య దైవమైన సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని విజయవంతం చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. మంగళవారం వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం బంజారా భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆర్డీఓ గోపి రామ్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖాధికారి రూపా దేవి, తహసీల్దార్ హుస్సేన్, సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవ కమిటీ సలహాదారు మూడ్ లక్ష్మణ్, గుగులోత్ లక్ష్మణ్, కమిటీ చైర్మన్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అజ్మీరా స్వామినాయక్, ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అనిత కోశాధికారి ధరావత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు

స్టేషన్‌ఘన్‌పూర్: ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని సీఐ జి.వేణు, ఎస్సై వినయ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని తాటికొండ, కొత్తపల్లి వాగుల నుంచి ఇసుక రవాణాను అడ్డుకునేలా సీఐ ఆదేశాల మేరకు ఎస్సై, పోలీస్‌సిబ్బంది ఆధ్వర్యంలో వాగుల వద్ద రోడ్డు మార్గాలను మంగళవారం పొక్లెయినర్‌తో ట్రెంచ్ కొట్టించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి



దేవరుప్పుల: మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల: గత ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలోనే పేదలకు అన్నివిధాలుగా న్యాయం జరుగుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సిరెడ్డి అన్నారు. మంగళవారం దేవరుప్పుల మండలంలోని రామరాజుపల్లి, కామారెడ్డిగూడెంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని అన్నారు. కాంగ్రెస్ మండల, యూత్, మహిళా, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సమావేశం..

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని విజయ కన్వెన్షన్ హాల్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బోనాసి క్రాంతికుమార్ అధ్యక్షతన యూత్ కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇస్తారి శ్రీలత

మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలిగా ఇస్తారి శ్రీలత, ఉపాధ్యక్షురాలుగా మున్నీ బేగంను మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు.

కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం

కొడకండ్ల: కష్టపడే కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. మంగళవారం హక్యాతండా, గుమ్ములబండ తండాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి పార్టీ సత్తాను చాటాలన్నారు. సమావేశంలో మార్కెట్ డైరెక్టర్లు దేశగాని నాగరాజు, క్రాంతికుమార్, అబ్దుల్లా, రవిందర్, భిక్షపతి, యాకయ్య, చందు, బాష, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి పూజ, జలాదివాసం



పూజ చేస్తున్న అర్చకులు

నర్మెట: మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతిపురాతన శివాలయం పూర్తిగా శిథిలం కావడంతో గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భక్తులు నూతనంగా ఆలయ నిర్మాణం చేపట్టారు. కాగా, సింహభాగం పనులు పూర్తికావడంతో భారతీ తీర్థ పురస్కార గ్రహీత, పురాణ వాచస్పతి, పరాశర సరస్వతి పురాణం మహేశ్వర శర్మ పర్యవేక్షణలో అత్తినూరు పవన్ కుమార శర్మ ఆధ్వర్యంలో మంగళవారం గణపతి పూజ, పుణ్యాహవచనం, అరణీమథనం, యాగశాల ప్రవేశం, మండలారాధన, జలాదివాస కార్యక్రమాలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను ప్రారంభించారు. బుధవారం స్థాపిత దేవతాహోమములు, స్నపనం, శయ్యాధివాస, పుష్పాదివాసములు, గురువారం శివపంచాయతన సుబ్రహ్మణ్య ఆంజనేయ ధ్వజ నవగ్రహ సహిత కాశీ విశ్వనాథ లింగ ప్రతిష్ఠ మేషలగ్న సుముహూర్తమున ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, బలి ప్రదానం, మహానీరాజనం, ఆశీర్వచనం మహాన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించబడునని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో పార్నంది శ్రీనివాస శర్మ, ప్రయాగ నాగభూషణ శర్మ, పార్నంది సతీష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా తరిగొప్పుల ఎస్సై గుగులోత్ శ్రీదేవి, నర్మెట హెచ్‌సీ ఎండీ. హిదాయత్ అలి, బచ్చన్నపేట సిబ్బంది తిరుపతి, వినయ్ తదితరులు బందోబస్తు కార్యక్రమం చేట్టారు..



బందోబస్తులో ఎస్సై, పోలీసు సిబ్బంది

ఆలయాన్ని దర్శించుకున్న కొమ్మూరి

మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శివాలయాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మంగళవారం దర్శించుకుని విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కొమ్మూరిని శాలువాతో సత్కరించారు. ఆయన వెంట జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శిరాజ్ యాదవ్, చేర్యాల మార్కెట్ కమిటి చైర్మన్ నల్లనాగుల స్వేత వెంకన్న, ఆలయ కమిటీ మెంబర్లు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సౌత్ జోన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కార్తీక్‌తో హెచ్‌ఎం నర్సింహారెడ్డి

చిల్పూరు: సౌత్ జోన్ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి వేల్పుల కార్తీక్ ఎంపికైనట్లు హెచ్‌ఎం కేతిడి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడారు. గత నెల హైదరాబాద్ దోమలగూడలో నిర్వహించిన షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి ట్రయల్స్ పోటీల్లో కార్తీక్ పాల్గొని ప్రతిభ కనబరి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం కార్తీక్‌ను షూటింగ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అన్నెపు కుమార్, పీడీ దేవ్‌సింగ్, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

క్రైం కార్నర్


మధ్యప్రదేశ్ రోడ్డు ప్రమాదంలో ఆర్.ఆర్.బంగ్లా వ్యక్తి దుర్మరణం



బాలరాజు (ఫైల్)

రఘునాథపల్లి: మధ్యప్రదేశ్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రామరాయనిబంగ్లా గ్రామానికి చెందిన కట్కూరి బాలరాజు మృతి చెందాడు. ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఆరేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లి మూడు ట్రావెలర్ బస్సులు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్ నాచారం కార్తికేయ నగర్‌కు చెందిన 9 మందిని బాలరాజు తన ట్రావెలర్ బస్సులో ప్రయాగ్‌రాజ్ టూర్‌కు తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్ జిల్లా సిహోరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొహ్లా గ్రామం వద్ద కాట్నీ నుంచి ఎదురుగా వచ్చిన ట్రక్ అతి వేగంగా ట్రావెలర్ బస్సును ఢీ కొట్టింది. దీంతో ఘటనా స్థలిలో బాలరాజుతో మరో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, రోడ్డు ప్రమాదంలో మరణించిన బాలరాజు మృతదేహం నేడు సాయంత్రం గ్రామానికి రానున్నట్లు మాజీ సర్పంచ్ బక్క యాదగిరి తెలిపారు. మృతుడికి భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు చంద్రనిలా, యశ్వంత్ ఉన్నారు. బాలరాజు మృతి పట్ల రామరాయినిబంగ్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

యువకుడి మృతి



వంశీ (ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామానికి చెందిన గుడికందుల అలివేలు-శ్రీనివాస్ దంపతుల కుమారుడు వంశీ (23) హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద చెరువులో మునిగి మృతి చెందిన సంఘటన రెండు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వంశీ హైదరాబాద్‌లో ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఆదివారం హాస్టల్ నుంచి వెళ్లి కనిపించకుండా పోయాడు. సోమవారం వరకు ఆచూకి లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు వంశీ ఫోన్ సిగ్నల్ ఆధారంగా శంషాబాద్ రాముని చెరువు వద్ద అతని దుస్తులు, ఫోన్, చెప్పులు గుర్తించి గజ ఈతగాళ్లతో వెతికించగా మృతదేహం లభ్యమైంది. కాగా, మంగళవారం సాయంత్రం స్వగ్రామంలో వంశీ అంత్యక్రియలు నిర్వహించారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి..

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోల భిక్షపతి (48) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షపతి ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గుర్జకుంట పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. భిక్షపతి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకుని పెళ్లికి నిరాకరిస్తూ మోసం చేసిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. భీమదేవరపల్లి మండలం నరహరితండాకు చెందిన లావుడ్యా విజయ్‌కుమార్‌తో 2020లో మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో నిశ్చితార్థం అయింది. అదే రోజు వరకట్నం కింద రూ.లక్ష, ఆ తర్వాత ఇంటి నిర్మాణం కోసం రూ.2 లక్షలు, మొత్తం రూ.3 లక్షలు అప్పజెప్పారు. అమ్మాయి మైనర్ కావడంతో చదువు పూర్తయ్యాక మేజర్ కాగానే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఎలాగూ పెళ్లి చేసుకుంటానని విజయ్‌కుమార్ పలుమార్లు యువతిని శారీరకంగా వాడుకుని.. యువతికి వేరే వారితో సంబంధం ఉందని పెళ్లికి నిరాకరించడంపై బాధిత యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విజయ్‌కుమార్‌పై పోక్సో కేసు, చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ, ఎస్సైలు తెలిపారు.

హుండీ చోరీ

పాలకుర్తి: మండలంలోని తీగారం దుర్గమ్మ ఆలయంలోని హుండీని దుండగులు పగులగొట్టి నగదు, భక్తుల వేసిన కానుకలను ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకులకథనం ప్రకారం.. మంగళవారం వారు ఆలయానికి వచ్చి చూడగా హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. హుండీలోని సుమారు రూ.25వేల నగదు, కానుకలు దుండగులు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై లింగారెడ్డి, పోలీసులు ఆలయానికి వచ్చి చోరీకి గురైన హుండీని పరిశీలించారు. త్వరలో దుండగులను పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

టిప్పర్లు, పొక్లెయినర్ సీజ్

రఘునాథపల్లి: మండలంలోని శివాజీనగర్ సమీపంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, పొక్లెయినర్, వెల్దిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్, తహసీల్దార్ ఎండీ మోహిసిన్‌ముజ్తబ మంగళవారం తెలిపారు. శివాజీనగర్ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు, పొక్లెయినర్‌ని పట్టుకుని సీజ్ చేసి, యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా మండలంలోని వెల్ది గ్రామంలో వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. డీటీ శంకర్, ఆర్‌ఐ శరత్‌చంద్ర ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫ్రీజర్ అందజేత

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూర్ గ్రామానికి గొడిశాల కొండయ్యగౌడ్ జ్ఞాపకార్థం అతని కుమారుడు కిరణ్‌గౌడ్ రూ70వేల ఫ్రీజర్‌ను మంగళవారం అందజేశారు. గ్రామపెద్దలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

'సముచిత స్థానం దక్కాలని పూజలు'

జనగామ: కాంగ్రెస్ పార్టీలో ముఖ్య భూమిక పోషిస్తూ, కార్యకర్తలకు అండగా, పార్టీకి గొంతుగా పనిచేస్తున్న అద్దెంకి దయాకర్‌కు సముచిత స్థానం దక్కాలని కోరుతూ మేడారం సమక్క-సారలక్క అమ్మల సన్నిధిలో మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ తాటి కుమార్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యావంతుడు, దళిత నాయకుడు, కాంగ్రెస్ గొంతుకగా మారిన అద్దంకి దయాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలతో కూడిన పదవి రావాలని మెజార్టీ కాంగ్రెస్ అభిమానులు కోరుకుంటున్నారన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశలోనే భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్యసాధనకు ప్రణాళికయుతంగా చదవాలని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో మంగళవారం విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఎం రమేశ్, టీచర్లు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్‌ఎస్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధి పల్లె రాజిరెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం కె.రమేష్, టీచర్లు ప్రవీణ్‌కుమార్, ఫకీర్‌దాస్, రవి, శ్రీనికాంత్, యాదగిరి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రదర్శన

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం పోలింగ్ స్టేషన్ల జాబితాను మంగళవారం ఎంపీడీఓ ఆవుల రాములు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం 106 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు.

దీక్ష విరమణ

కొడకండ్ల: గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికల్లో సెక్షన్21(3) 1995 మే 30 చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ అభిమన్‌గాంధీ నాయక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను మంగళవారం విరమించారు. కొడకండ్ల మండలం గిర్నితండాలో నాలుగో రోజు దీక్షను కొనసాగించిన అభిమన్‌గాంధీనాయక్ వద్దకు దయాకర్‌రావు వెళ్లి నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. చట్టాన్ని రద్దు చేసి ఇద్దరికి మించిన సంతానం కలిగిన వారికి స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించాలని దయాకర్‌రావు డిమాండ్ చేశారు.

పరామర్శ

దేవరుప్పుల: మండలంలోని పెద్దతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య నంద మృతి చెందాడు. కాగా, మాజీ మంత్రి దయాకర్‌రావు గ్రామానికి చేరుకుని నంద అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. దయాకర్‌రావు మాట్లాడుతూ నంద మృతి పార్టీకి తీరని లోటని, ఆయన సేవలను కొనియాడారు.

మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కు..

జఫర్‌గఢ్: ఇటీవల మాతృవియోగం పొందిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్‌ను ఉప్పుగల్లులో పలువురు పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మాజీ జెడ్పీ చైర్మన్ సాంబారి సమ్మరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య తదితరులు ఉన్నారు.